క్లుప్తంగా

'తుర్కాకాశా' జిల్లా అధ్యక్షుడిగా బడే సాహెబ్



సత్తుపల్లి: తెలంగాణ తుర్కాకాశా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్తుపల్లి మండలం పాకాలగూడెంకు చెందిన షేక్ బడే సాహెబ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడి నుంచి ఆయన నియామక పత్రం అందుకున్నారు. కాగా, తుర్క కాశాల సమస్యలను మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని బడే సాహెబ్ తెలిపారు.

క్షేత్ర ప్రదర్శన



క్షేత్ర ప్రదర్శనలో రైతులు, అధికారులు

వైరా: మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామంలో మంగళవారం భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా గురించి రైతులకు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మయాన్ మంజుఖాన్ రైతులతో మాట్లాడుతూ... భూమిలో నిల్వ ఉండే భాస్వరం మొక్కకు అందనప్పుడు భాస్వరాన్ని కరిగించి మొక్కలకు అందించేందుకు బ్యాక్టీరియా పని చేస్తుందన్నారు. ఈ బ్యాక్టీరియాను పశువుల ఎరువు లేదా కంపోస్టు ఎరువులో లేదా ఇసుకలో కలుపుకుని పొలంలో చల్లుకోవచ్చన్నారు.

పాఠశాలలకు వంటపాత్రలు పంపిణీ

ఏన్కూరు: మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు మంగళవారం వంటపాత్రలు పంపిణీ చేశారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 51 ఉండగా 43 పాఠశాలలకు సామగ్రి అందజేశారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

కొణిజర్ల: ప్రజా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి తమ జీవితాన్ని పేదలకు అంకితం చేసిన అమరవీరుల ఆశయ సాధనకు నేటి యువత పాటు పడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొంతు రాంబాబు, తాళ్లపల్లి కృష్ణ అన్నారు. ఈ మేరకు మండలంలోని సింగరాయపాలెంలో బేగ్‌నాగులు మీరా వర్ధంతి సభ సందర్భంగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు కుటుంబరావు, చలపతిరావు, కృష్ణార్జునరావు, రామారావు, నర్సయ్య, రోషన్ బేగ్, ఖాసీం బేగ్, బజార్, నాగయ్య, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, కృష్ణ, ఆజాద్, అబీద్, అఫ్జల్ ఉన్నారు.

నివాళి..



వెంకట్రావు(ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని గట్లగౌరారం పంచాయతీ తాజామాజీ సర్పంచ్ వెల్రు వెంకట్రావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందగా పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు యరమల పూర్ణచంద్రారెడ్డి, కడియం శ్రీనివాసరావు, అనుమోలు కృష్ణారావు, బండ్ల ఆత్మ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, గుడేటి బాబురావు, వరప్రసాద్, పిచ్చిరెడ్డి, రాజీవ్‌గాంధీ, శివయ్య, ప్రసాదరెడ్డి, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలికి...



నగదు అందజేస్తున్న సీడీపీఓ

బోనకల్: మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు పిల్లెం జ్యోతి(52) మంగళవారం మృతి చెందగా పలువురు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ మేరకు మధిర సీడీపీఓ బాలత్రిపుర సుందరి, సూపర్‌వైజర్లు రమాదేవి, సుజాత, శ్రీలక్ష్మి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చిన తక్షణ సాయం రూ.20 వేల నగదు అందజేశారు.

రెండో రోజుకు చేరిన ఆస్పత్రి కార్మికుల సమ్మె

కల్లూరు: వేతనాల కోసం ప్రభుత్వాస్పత్రిలో కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మోకాళ్ల పై కూర్చుని నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ.. ఈ నెల 23 వరకు వేతనాలు జమ చేయకపోతే పూర్తి స్థాయిలో విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్‌రావు, కార్మికులు ఉన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు..

దశ మారనున్న వేంసూరు మండలం

- ఒకప్పుడు సీఎంను అందించిన నియోజకవర్గ కేంద్రం
- ఆ తర్వాత ప్రాభవం కోల్పోయినా.. ఇప్పుడు పునర్వైభవం



వేంసూరు గ్రామం

వేంసూరు: ఒకప్పుడు నియోజకవర్గం కేంద్రంగా ఉండి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అందించిన వేంసూరు మండలం.. కాలక్రమంలో ఉనికి కోల్పోయి మధ్యాహ్న సమయంలో టీ కూడా దొరకని స్థితికి చేరింది. కరువు మండలంగా ఉన్న వేంసూరుకు బేతుపల్లి ప్రత్యామ్నాయ కాల్వ ద్వారా చెరువులకు సాగునీరు పుష్కలంగా చేరడంతో రెండు పంటలు పండుతున్నాయి. తరువాత ఖమ్మం -దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్‌తో అభివృద్ధి దిశగా పయనిస్తుంది.

నాడు నియోజకవర్గ కేంద్రం..

1952 నుంచి నియోజకవర్గ కేంద్రంగా ఉన్న వేంసూరు నుంచి జలగం వెంగళరావు ఇక్కడ నుంచి గెలిచి ఉమ్మడి రాష్ట్ర హోం మంత్రిగా తరువాత రాష్ట్ర ముఖ్యమంతిగా చేశారు. స్వాతంత్రానికి పూర్వం నుంచే ఇక్కడ పోలీస్ స్టేషన్ ఉండేదని గ్రామస్తులు అంటున్నారు. తరువాత సత్తుపల్లి నియోజకవర్గంలో మండలంగా చేరింది.

గ్రీన్‌ఫీల్డ్ ఎగ్జిట్‌తో..



గ్రీన్‌ఫీల్డ్ హైవేలో సిద్ధమవుతున్న ఎగ్జిట్

వేంసూరు గ్రామం మండల కేంద్రం అయినప్పటికీ వేంసూరు మండలానికి నాలుగు రోడ్ల కూడలిగా ఉన్న మర్లపాడు గ్రామం వాణిజ్యంగా అభివృద్ధి చెందింది. వేంసూరు గ్రామస్తులు ప్రతీ అవసరానికి మర్లపాడు వెళ్లేవారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభమైనప్పటి నుంచి అక్కడ వ్యాపార దుకాణాలు పెరుగుతూ వస్తున్నాయి. సత్తుపల్లి, ఆంధ్రాకు చెందిన ప్రజలు ఖమ్మం, రాజమండ్రి, వైజాక్ వెళ్లాలంటే వేంసూరు ఎగ్జిట్ నుంచి రాకపోకలు సాగించాల్సి ఉండడంతో.. పలువురు ఇప్పటికే హైవేపై దాబాలు, పెట్రోల్ బంక్‌లు, వ్యాపార దుకాణాలు, మెడికల్ షాపులు ఏర్పాటు చేశారు. కల్లూరుగూడెంలో నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీ మండలానికి మరో మణిహారంలా మారనుంది.

ఎగ్జిట్‌తో అభివృద్ధి



వేంసూరు గ్రామ సమీపంలో ఎగ్జిట్ ఏర్పటుతో వేంసూరు పూర్వ వైభవం వచ్చే విధంగా అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. ఎగ్జిట్ మంజూరు నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే వైపు గ్రామం అభివృద్ధి చెందుతుంది. భవిష్యత్ మరింత అభివృద్ధి అవుతుంది.

– వెల్ది జగన్‌మోహన్‌రావు, సీనియర్ నాయకుడు

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్‌తో భవిష్యత్ ట్రాఫిక్ భారీగా పెరుగుతుంది. హైదారాబాద్, రాజమండ్రి, వైజాగ్ వెళ్లేందు వేంసూరు ఎగ్జిట్ నుంచే రాకపోకలు సాగించాలి. దీంతో ట్రాఫిక్ పెరుగుతుంది. వేంసూరు నుంచి మర్లపాడు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎండీ.ఫైజుద్దీన్, వేంసూరు మాజీ సర్పంచ్

పామాయిల్ ఫ్యాక్టరీ ఆదాయ వనరు



వేంసూరు మండల అభివృద్ధిలో పామాయిల్ ఫ్యాక్టరీ మరో ఆదాయ వనరుగా మారనుంది. జిల్లాలోనే మొదటి ఫ్యాక్టరీ కావడంతో నిర్మాణం పూర్తయితే రైతులతో పాటు వేంసూరు మండల అభివృద్ధికి మణిహారంలా మారనుంది.

– బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యం..

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఏన్కూరు: రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కోరారు. స్థానిక కమ్మవారి కల్యాణ మండపంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి విజయకేతనం ఎగరవేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు పార్టీకి పునాది లాంటివారన్నారు. అనంతరం తిమ్మారావుపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా మహిళ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏజెండ్ల సాయికుమార్, నాయకులు బొర్రా రాజశేఖర్, స్వర్ణ నరేందర్, వేముల కృష్ణప్రసాద్, లాలునాయక్, నారాయణరావు, మేఢ ధర్మారావు, స్వర్ణ ప్రహ్లాదరావు, కొప్పుల ప్రభావతి రెడ్డి, నాగేశ్వరావు, పంతగాని నరేష్, పాలెం శేఖర్, సాయి రోహిత్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

ఏన్కూరు మండలంలో నూకలంపాడు మేజర్ కాల్వ, జన్నారం పశువైద్యశాల సబ్‌సెంటర్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నూకలంపాడు మేజర్ కాల్వ ముళ్ల చెట్లు పొదలతో నిండి ఉందని, పూడిక తీయకపోవడంతో చివరి భూములకు నీరు అందడం లేదన్నారు. జన్నారంలో పశువైద్యశాల సబ్‌సెంటర్లో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉండటంతో పరిసర గ్రామాల్లో పశువులకు వైద్యం అందక తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

'డ్రమ్ సీడర్'తో సాగుకు మేలు



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

ముదిగొండ: రైతులు డ్రమ్ సీడర్ విధానంలో వరి సాగు చేపడితే ఎంతో మేలు జరుగుతుందని మధిర ఏడీఏ విజయచంద్ర అన్నారు. ఈ మేరకు ముదిగొండలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వానాకాలంలో సాగు చేపట్టే పద్ధతి, కలుపు తీసే విధానం, ఉపయోగించాల్సిన ఎరువులు, నానో యూరియాతో లాభాలను వివరించారు. ఈ మేరకు వినియోగించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఉచితంగా కంది విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరిత, ఏఈఓ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారి వ్యవస్థలో కీలుబొమ్మగా మహిళలు



మాట్లాడుతున్న లతాదేవి

చింతకాని: మహిళల శక్తి సామర్థ్యాలను పెట్టుబడిదారి వ్యవస్థ తన చేతుల్లో కీలుబొమ్మగా మార్చుకుందని తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి అన్నారు. మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సమాఖ్య మండల మహాసభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో మహిళలు అందిస్తున్న సేవలను గుర్తుచేశారు. సమసమాజ స్థాపనలో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. **సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ...** ఈనెల 19, 20వ తేదీల్లో మధిరలో జరిగే పార్టీ జిల్లా మహసభలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా పావులూరి శ్రీలత, కార్యదర్శిగా నారపోగు హేమలతో పాటు 33 మందితో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, జిల్లా ఉపాధ్యక్షురాలు కన్నెబోయిన విజయమ్మ, జమ్ముల లక్ష్మీ, ఏపూరి పద్మ, కొండపర్తి ఉష, కల్యాణి, ఉమ, సుజాత, రమాదేవి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు పావులూరి మల్లికార్జున్‌రావు, రవి, మండల సహాయ కార్యదర్శులు అబ్బూరి మహేష్, మార్గం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

వైరా: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతూ, సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వైరాలోని సీపీఎం కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అధ్యక్షతన డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు అనేక స్థానిక సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, దుగ్గి కృష్ణ, కొండెబోయిన నాగేశ్వరరావు, మచ్చా మణి, పార్టీ మండల కార్యదర్శులు నాగేశ్వరరావు, చలపతిరావు, శ్రీనివాసరావు, నరేంద్ర, శ్రీనివాసరెడ్డి, నాయకులు బాలాజీ, కృష్ణార్జునరావు, పద్మ, నాగేశ్వరరావు, రామారావు, రాములు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మయ్య

సత్తుపల్లి: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (ఎస్‌బీఎస్) నూతన ప్రిన్సిపల్‌గా జి.లక్ష్మయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 2024 నుంచి కోదాడ జూనియర్ కళాశాలలో హిస్టరీ లెక్చరర్‌గా పనిచేసి ఉద్యోగ ఉన్నతిపై సత్తుపల్లికి బదిలీ అయినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేసి కళాశాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


ప్రజా సమస్యలే అజెండా



మాట్లాడుతున్న శివరామకృష్ణ

కారేపల్లి: ప్రజల సమస్యలే సీపీఐ అజెండా అని, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19, 20 తేదీల్లో మధిర పట్టణంలో జరిగే పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. తాతా వెంకటేశ్వర్లు, ఉంగరాల సుధాకర్, మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, రైతు సంఘం మండల కార్యదర్శి పుచ్చకాయల శ్రీనివాసరావు, మండల సహాయ కార్యదర్శి చెన్నంశెట్టి భూషయ్య, వడ్డె వెంకటయ్య పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆనందరావు

బోనకల్: ఈ నెల 19, 20 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండలంలోని కలకోట గ్రామంలో పార్టీ మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలగూరి అచ్చయ్య, యంగల వెంకటమ్మ, వసంత, సత్యవతి, రమ్య, ఏలేసు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

చింతకాని: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి ఆల్తాఫ్ అన్నారు. మండలపరిధిలోని నేరడ గ్రామంలో ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు డాక్టర్ సోహైల్, సీహెచ్‌ఓ వీరేందర్, ఎస్‌టీఎస్ షేక్ ఇమాం, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం పద్మ, పంచాయతీ కార్యదర్శి అర్జున్, ఆశా కార్యకర్తలు కృష్ణమ్మ, మరియమ్మ, దీనమ్మ, బేవి పాల్గొన్నారు.

నేడు శాకాంబరీదేవిగా పెద్దమ్మతల్లి

కారేపల్లి: మండలకేంద్రంలోని శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారు మంగళవారం శాకాంబరీదేవి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. దీనికి సంబంధించి సోమవారం భక్తులు ఆలయంలో ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఆలయ అర్చకులు మల్లిఖార్జున శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ తురక నారాయణ, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

క్రిస్టియన్ కౌన్సిల్ కార్యవర్గం ఎన్నిక

తల్లాడ: తెలంగాణా క్రిష్టియన్ కౌన్సిల్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీసీసీ రాష్ట్ర నాయకులు ఎండి.సుదర్శన్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడిగా కె.ఇశ్రాయేలు, ఉపాధ్యక్షుడిగా ప్రకాష్‌రావు, కార్యదర్శిగా దేవసహాయం, మహిళా అధ్యక్షురాలుగా డి.దీనమ్మలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బాబు ఆనందరావు, ప్రకాష్‌రావు, హరికృష్ణ, కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం



భక్తాంజనేయ స్వామి ఆలయంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వేంసూరురోడ్ మెట్టాంజనేయస్వామి ఆలయం, అయ్యగారిపేట శ్రీభక్తాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం స్వామివారికి ఆకుపూజలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతనిప్పు శ్రీనివాస్, రమ్య దంపతులు శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయానికి రూ.15,000 వితరణ చేసి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగళ్ల ప్రసాద్, కొప్పుల రజిని, మల్లూరు అంకమరాజు, కాలినేని కాంతారావు, జి.వెంకటేశ్వరరావు, వెంకటరమణ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

24న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభలు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

వైరా: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభలను ఈనెల 24న వైరాలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వరరావు, నాయకుడు ఏనుగు వెంకటేశ్వరావు తెలిపారు. వైరాలో మంగళవారం జరిగిన యూనియన్ సమావేశంలో మహాసభల విజయవంతానికి పలు కమిటీలను నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లా మహాసభలకు జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కొత్తా వెంకటేశ్వరరావు, పులి కృష్ణార్జునరావు, ఏపూరి రాజారావు, గొల్లమండల విజయ్‌కుమార్, మేరుగు కృష్ణ, ఎక్కిరాల శ్రీనివాసరావు, ఆదూరి ప్రేమ్, రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాసరావు, బాబూరావు, శ్రీకాంత్, వినోద్, లక్ష్మణాచారి, సాయి, రవితేజ, అతావుల్లా, ప్రశాంత్, మురళీకృష్ణ, వెంకటరెడ్డి, రాజు, మహేష్ ఉన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

కొణిజర్ల: రాజ్యాంగ హక్కులకు పోరాడుదాం, ఆదివాసీల హక్కుల కాపాడుకుందాం అనే నినాదం ఈనెల 19న ఇల్లెందు పట్టణంలో నిర్వహించే అరుణోదయ రాష్ట్ర సదస్సుకు జిల్లాలోని కళాకారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయగిరి పిలుపునిచ్చారు. మంగళవారం కొణిజర్లలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బాణోత్ కిషన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయగిరి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బహుళ జాతి కంపెనీలకు దేశ సంపదను దోచి పెడుతూ సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నా శ్రీకాంత్, పరకాల లక్ష్మక్క, నాగయ్య, గద్దం మహేష్, అరెంపుల నాగేశ్వరరావు, కిషోర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉదయగిరి

ఘనంగా 'సీత్లా'



పూజలు చేస్తున్న గిరిజనులు

తల్లాడ: మండలంలోని మల్సూర్‌తండా గ్రామంలో గిరిజనులు సీత్లా పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వచ్చి భవానీలను పూజించారు. అనంతరం పొలాల మధ్యకు వెళ్లి గోమాతలను, కాడెడ్లను పూజించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాలోత్ లింగయ్య, మాజీ ఎంపీటీసీ మోహన్ నాయక్, కృష్ణా నాయక్, మాన్సింగ్ నాయక్, వాలియానాయక్, సక్రియా నాయక్, మీరు, అమర్‌సింగ్, సక్రిబాయి, వాలీ, బీముని బాయి, దివిలి, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ నిరుపయోగం.. అక్కడ శిథిలం

- నిర్మాణం పూర్తయినా ప్రారంభించని ఆరోగ్యకేంద్రం
- మరో పక్క శిథిల స్థితిలో లైబ్రరీ భవనం



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఆరోగ్య ఉపకేంద్రం



శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయం

ముదిగొండ: ముదిగొండ కేంద్రంలో ఆరోగ్య ఉపకేంద్ర భవనం ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకుంటుంది. ఇప్పటికే భవనం తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం రూ.లక్షల నిధులతో నిర్మించిన ఈ భవనం నిరుపయోగంగానే కాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో భవనం దుర్వినియోగమవుతోంది. ఇక గ్రంథాలయ భవనం పూర్తి శిథిలావస్థకు చేరింది. ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించని గ్రంథాలయాన్ని ఈ భవనాల్లోకి మార్చితే బాగుండని, గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు. ఎప్పుడు కూలుతుందోనని బిక్కుబిక్కుమని గడపాల్సి వస్తుందని ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టిలో ఉంది..



శిథిలావస్థలో ఉన్న శాఖ గ్రంథాలయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. నిధులు మంజూరు విషయాలు పూర్తి స్థాయిలో సమాచారం లేదు. ఇక్కడ నుంచి మార్చే విధంగా అధికారులతో కమిటీ సమావేశం నిర్వహించి పై అధికారుల సూచన మేరకు తాత్కాలిక సమస్యను ప్రత్యామ్నాయంగా చూస్తాం

– ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ముదిగొండ

మాకు స్వాధీనం చేయలేదు..



ఆరోగ్య ఉపకేంద్రాన్ని కాంట్రాక్టర్ మా శాఖకు స్వాధీనం చేయలేదు. అప్పటి నుంచి మా స్వాధీనంలో లేకనే నిరుపయోగంగా ఉంది. కలెక్టర్‌కు, అధికారుల దృష్టిలో ఉంది. ఉత్తర్వులు వస్తే అధికారుల ఆదేశాలతో వైద్యసేవలు అందిస్తాం.

– అరుణాదేవి, ముదిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారిణి